
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట
3
శనివారం 12 జూలై 2025





గజ్వేల్‌లోని జిల్లా ఆసుపత్రి

జిల్లా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు

- వరుసగా మూడో ఏడాది ద్వితీయ స్థానం
- జిల్లాలోని దుబ్బాక, హుస్నాబాద్ ఆసుపత్రులకూ అవార్డులు

గజ్వేల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే కాయకల్ప అవార్డుల్లో గజ్వేల్‌లోని జిల్లా ఆసుపత్రి హ్యాట్రిక్ కొట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులకు రాష్ట్రస్థాయిలో పోటీ నిర్వహించగా బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి ప్రథమ స్థానంలో నిలిచింది. గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి రెండో స్థానంలో నిలిచింది. జిల్లా నుంచి గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, నంగునూరు, చేర్యాల ఏరియా ఆసుపత్రులు కాయకల్ప అవార్డులకు పోటీపడ్డాయి. వీటిలో గజ్వేల్ ఏరియా ఆసుపత్రి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచి రూ.10 లక్షల కాయకల్ప నగదు అవార్డు గెలుచుకుంది. ఆసుపత్రుల నిర్వహణ, ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, వైద్య సేవల పెంపు, పరిశుభ్రత, బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాల్లో కార్పొరేట్‌కు దీటుగా, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణలో మేలైన సేవలను పెంపునకు స్వచ్ఛభారత్‌లో భాగంగా కాయకల్ప అవార్డుల పేరుతో కేంద్రం నగదు అవార్డులను జిల్లా ఆరోగ్య సొసైటీలకు అందిస్తుంది. జిల్లాలో గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి రూ.10 లక్షలు, దుబ్బాక ఏరియా ఆసుపత్రికి ప్రోత్సాహక బహుమతి రూ.లక్ష, ఈకో ఫ్రెండ్లీ అవార్డు కింద రూ.5 లక్షల నగదు అవార్డు లభించింది. హుస్నాబాద్ ఏరియా ఆసుపత్రికి ప్రోత్సాహక బహుమతి కింద రూ.లక్ష నగదు అవార్డు లభించిందని సిద్దిపేట డీసీహెచ్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ తెలిపారు.



హార్టీకల్చర్ యూనివర్సిటీలో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ

ములుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితంలో సరస్వతిమాత జ్ఞానాన్ని ప్రసాదించే దైవమని హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



వరి వేయాలా..వద్దా!

- 2,14,071 ఎకరాల్లో నాట్లు వేస్తారని అంచనా
- ఇప్పటికీ సాగయ్యింది..24,725 ఎకరాలే
- లోటు వర్షపాతంతో అన్నదాతల్లో ఆవేదన
- కురవాల్సింది 157.6 శాతం కురిసింది 154.7శాతం

తొగుట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా సకాలంలో వానలు కురవక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నారు పోసిన రైతులు నాటు సమయం మించిపోతుండడంతో వర్షాల కోసం ఆకాశం వైపు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. వర్షాకాలంలో జూలై నాటికి 157.6 శాతం వర్షం పడాల్సి ఉండగా కేవలం 154.7 శాతమే వర్షం కురిసింది. -1.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

జిల్లాలో 2,14,071 ఎకరాల్లో రైతులు వరి సాగుచేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేసినప్పటికీ జూలై ప్రారంభమై పదిరోజులు గడుస్తున్నా కేవలం 24,725 ఎకరాల్లో వరి నాట్లు పడడం గమనార్హం. 96,894 ఎకరాల్లో పత్తి, 19,448 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. కంది తదితర పంటలు సుమారు 5 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట- భూంపల్లి మండలంలో 245 ఎకరాల్లో వరి, 1,151 ఎకరాల్లో పత్తి, 402 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. దౌల్తాబాద్ మండలంలో 2,050 ఎకరాల్లో వరి, 1,650 ఎకరాల్లో పత్తి, 2,650 ఎకరాల్లో మొక్కజొన్న, దుబ్బాక మండలంలో 1,460 ఎకరాల్లో వరి, 455 ఎకరాల్లో పత్తి, 564 ఎకరాల్లో మొక్కజొన్న, మిరుదొడ్డి మండలంలో 260 ఎకరాల్లో వరి, 1,350 ఎకరాల్లో పత్తి, 2,100 ఎకరాల్లో మొక్కజొన్న, రాయపోల్ మండలంలో 50 ఎకరాల్లో వరి, 6,595 ఎకరాల్లో పత్తి, 993 ఎకరాల్లో మొక్కజొన్న, తొగుట మండలంలో 226 ఎకరాల్లో వరి, 1,950 ఎకరాల్లో పత్తి, 2,670 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. దాంతో వ్యవసాయ అధికారుల అంచనాకు సాగు విస్తీర్ణానికి పొంతన లేకుండా పోయింది. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోతే పంట సాగు ఇంకా తగ్గే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులే చెప్పడం గమనార్హం.


వరినాటు కోసం ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

వర్షాలు కురవకపోతే సాగు కష్టమే



కాలం ఇలాగే ఉంటే పంటల సాగు కష్టమవుతుంది. వేసిన పంటకూడా చేతికి వచ్చే పరిస్థితి ఉండదు. ఇప్పటికే అప్పుసప్పుచేసి విత్తనాలు భూమిలో పోసినం. నార్లు ముదిరిపోతున్నయి. వారం, పది రోజుల్లో వర్షాలు పడితేనే వరి సాగు చేసే అవకాశం ఉంటుంది. లేకుంటే బతకడం కూడా కష్టమే.

- చిక్కుడు చంద్రం, రైతు, తుక్కాపూర్

జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా స్వరూపరాణి


స్వరూపరాణి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై11: సిద్దిపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా స్వరూపరాణిని నియమిస్తూ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు ఆమె కలెక్టర్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న స్వరూపరాణిని జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా ప్రభుత్వం నియమించింది. జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏడీఏ రాధికను తిరిగి ఆమె గతంలో పనిచేస్తున్న చేర్యాలలో వి.దులు నిర్వర్తించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

రతన్‌గౌడ్‌కు 363వ ర్యాంకు


రతన్‌గౌడ్

సిద్దిపేట కల్చరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): తాజాగా విడుదలైన నీట్ యూజీ తెలంగాణ స్టేట్ ర్యాంకుల జాబితాలో సిద్దిపేటకు చెం దిన నాచగోని రతన్‌గౌడ్ 363వ ర్యాంకు సాధించారు. మే నెలలో జరిగిన పరీక్షల ఫలితాలు గత జూన్‌లో విడుదలయ్యాయి. జూన్‌లో నేషనల్ ర్యాంకులు ప్రకటించగా తాజాగా స్టేట్ ర్యాంకుల జాబితాను ప్రకటించారు. ఈ నేపథ్యంలో పట్టణంలో నివసిస్తున్న నాచగోని సత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు నాచగోని రతన్ గౌడ్ 537 మార్కులు స్కోర్ చేసి 363 ర్యాంకు సాధించారు. అంతకు ముందు నీట్ అలిండియా ర్యాంకు 18893 ర్యాంకు వచ్చింది. చిన్నప్పటి నుండి చదువుల్లో ముందుండే రతన్ గౌడ్ నవోదయ స్కూల్ పదవ తరగతిలో కూడా మంచి మార్కులతో ఉమ్మడి మెదక్ జిల్లా టాపర్‌గా నిలిచాడు. తాజాగా విడుదలైన నీట్ యూజీ ఫలితాల్లో మంచి ర్యాంకు రావడంతో అధ్యాపకులు, పలువురు అభినందనలు తెలిపారు.

వానాకాలం... వ్యాధుల కాలం

- వాతావరణ మార్పులతో దోమల విజృంభణ
- పారిశుధ్య లోపంతో జర్వాలు
- డెంగీ, మలేరియా ముప్పు.. అప్రమత్తతే రక్ష
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం 5



‘కేజీబీవీ’ పనులకు మోక్షమెన్నడో?

- రాయపోల్‌లో సొంత భవనానికి రూ.3.50 కోట్లు మంజూరు
- నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే
- నేటికీ పనులు పూర్తికాక అద్దె భవనం వరండాలో చదువులు
- అరకొర వసతుల మధ్య విద్యార్థులకు తప్పని తిప్పలు

6

నాటు.. నాటు..

- బర్డ్‌ఫ్లూ దెబ్బకు పౌల్ట్రీఫాంలు కుదేలు
- నాటు కోళ్ల పెంపకంతో సరికొత్త దారి
- ఫారంలో కాకుండా బయట పెంపకం
- సోనాలి రకానికి మార్కెట్‌లో డిమాండ్


5

నష్టాల రూట్ మార్చి లాభాల దారిలో ప్రయాణం

- హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు యేటా రూ.4కోట్ల లాభాలు
- పెరిగిన దూర సర్వీసులు..
- కరీంనగర్ రీజియన్‌లో అద్దె వచ్చే స్టాళ్లలో హుస్నాబాద్ రెండవది



హుస్నాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు నష్టాల పేరుతో హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఎత్తివేత. ప్రజా ఉద్యమాలతో తిరిగి సాధించుకున్నా మనుగడ మాత్రం ప్రశ్నార్థకం. నష్టాల బాటలో వెళ్తుండగా మళ్లీ ఎత్తివేత శరణ్యమనుకుంటున్న తరుణంలో డిపోను మహాలక్ష్మి పథకం లాభాల బాట పట్టించింది. నేడు కొత్త బస్సులు, దూర సర్వీసులు, అదనంగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బందితో నష్టాలను అధిగమించి లాభాల దారిలో పయనిస్తుంది. మూడేళ్ల క్రితం రూ.5.33 కోట్ల నష్టంతో ఉన్న డిపో నేడు ఈ నష్టాలను దాటుకుని యేటా రూ.4 కోట్ల లాభాలతో ముందుకు సాగుతుంది. ప్రస్తుతం డిపో ప్రారంభంలో దూర ప్రాంతాలకు ఇక్కడి నుంచి బస్సులు నడిపించినా మధ్యలో రద్దు చేశారు. మళ్లీ ఇప్పుడు దూర ప్రాంతాలకు బస్సులు సర్వీసులు కొనసాగిస్తున్నారు. ప్రతిరోజు హుస్నాబాద్ నుంచి 36,500 మంది ప్రయాణం సాగిస్తుండగా రూ. 13.50 లక్షల ఆదాయం వస్తుంది.

1997లో డిపో ఏర్పాటు.. 2006లో ఎత్తివేత

హుస్నాబాద్‌లో డిపో ఏర్పాటుకు 7 ఆగస్టు 1994లో అప్పటి కేంద్ర జౌళిశాఖ మంత్రి వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. 27 జూలై 1997లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ ప్రారంభోత్సవానికి వచ్చారు. ఆనాడు ఇక్కడి సీపీఐ, టీడీపీ మధ్య వైరాలతో ఘర్షణలు జరిగి నారాయణ అనే ఆర్టీసీ కార్మికుడితో ప్రారంభించారు. తదనంతరం గ్రామాలకు సరైన రోడ్లు లేకపోవడం, ఇతర కారణాల వల్ల అంతట నష్టం వచ్చిన మాదిరిగానే హుస్నాబాద్ డిపోలో కూడా నష్టాలు మొదలయ్యాయి. జిల్లాలో ఎక్కువ నష్టాల్లో ఉన్న డిపోలను వదిలి హుస్నాబాద్ డిపోను 31డిసెంబర్ 2006లో ఎత్తివేశారు. ప్రజల్లో ఆగ్రహం మొదలైంది. పార్టీలకతీతంగా ఉద్యమాలు చేపట్టారు. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. ప్రభుత్వం దిగివచ్చి మినీ బస్‌డిపోగా పునరుద్ధరించారు. ఆ తర్వాత ఎక్స్‌ప్రెస్ బస్సులను రద్దు చేయడం, గత రూట్లలో ఉన్న బస్సులను నడపకపోవడం, ఆదాయం వచ్చే మార్గాలను అన్వేషించకపోవడంతో డిపో నష్టాల బాట పట్టింది. ఒకానొక దశలో డిపోను మళ్లీ ఎత్తివేస్తారన్న ప్రచారం జరిగింది

యేటా రూ.4 కోట్ల లాభాలు

మహాలక్ష్మి పథకం వచ్చిన తరువాత డిపో నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. రోజు డిపోకు రూ. 13.50 లక్షల ఆదాయం సమకూరుతుంది. 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు రూ. 28.50 కోట్లు. 2024 మార్చి 2025 మార్చి వరకు రూ. 38.24 కోట్లు వచ్చాయి. మహాలక్ష్మి పథకం రాక ముందు 2022 మార్చి 2023 మార్చి వరకు రూ. 5.33 కోట్ల నష్టాల్లో ఉండగా 2023-2024 వరకు రూ.1.15 కోట్లకు తగ్గింది. 2024-2025 వరకు రూ.2.93 కోట్ల లాభాలకు వచ్చింది. ప్రతి యేటా రూ. 4 కోట్ల లాభాల్లో నడుస్తుంది.

రూ. 2 కోట్లతో బస్టాండ్ ఆధునీకరణ..

హుస్నాబాద్ బస్టాండ్‌ను రూ. 2కోట్లతో సర్వాంగ సుందరంగా ఆధునీకరించారు. బస్టాండ్‌లో ప్లాట్‌ఫామ్‌లను పెంచారు. బస్టాండ్ చుట్టూ గ్రీనరీ పెంచారు. కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోలు ఉండగా కరీంనగర్ డిపో తరువాత హుస్నాబాద్ డిపోకు 80 స్టాళ్ల అద్దె ద్వారా నెలకు రూ. 6లక్షల ఆదాయం వస్తుంది.



డిపోలో 62 బస్సులు

నేడు హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో 62 బస్సులుండగా ఇందులో 22 అద్దె బస్సులు, 40 ఆర్టీసీ బస్సులున్నారు. ఎక్స్‌ప్రెస్‌లు ఆర్టీసీ 10, సూపర్ లగ్జరీలు 2 ఉన్నాయి. ఒక్క ఆరు మినహా దాదాపుగా కొత్త బస్సులతో నడిపిస్తున్నారు. ఈ డిపో 57 షెడ్యూల్స్, 72 మంది డ్రైవర్లు, 108 మంది కండక్టర్లు, 38 మంది మెకానిక్‌లు, ఐదుగురు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.కోటి జీతాలు చెల్లిస్తున్నారు. హుస్నాబాద్ డిపో బస్సుల్లో 36,500 మంది ప్రయాణిస్తుండగా ఇందులో 25,500 మంది మహిళలు ఉంటున్నారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, చిగురుమామిడి నాలుగు మండలాల్లో 85 గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్తున్నాయి.

దూర ప్రాంతాలకు బస్సులు

ఇటీవల హుస్నాబాద్ నుంచి దూర ప్రాంతాలకు బస్సులను సర్వీసు చేస్తున్నారు. హుస్నాబాద్ నుంచి భద్రాచలం, బాసర, వేములవాడ,

మిగతా 6వ పేజీలో

కోహెడలో కలెక్టర్ పర్యటన

- ఇందిరమ్మ ఇళ్లు, మధ్యాహ్న భోజనం పరిశీలన
- పీహెచ్‌సీ తనిఖీ

కోహెడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలంలో కలెక్టర్ హైమావతి శుక్రవారం పర్యటించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది హాజరు రిజస్టర్, అవుట్ పేషంట్ల రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది, మెడికల్ అధికారులు అనుమతి లేకుండా కేవలం లీవ్ లెటర్ మాత్రమే ఉండడం గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ అధికారి ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తంగళ్లపల్లి, శనిగరం గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. అంతకుముందు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించడానికి స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.


కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ చెక్ చేసుకుంటున్న కలెక్టర్

23న గవర్నర్ పర్యటన

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 23న పర్యటించనున్నందున సభ జరిగే మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌ను పరిశీలించి సూచనలు చేశారు. హెలీప్యాడ్ కోసం పిచ్చిమొక్కలను తొలగించాలని ఆర్అండ్‌బీ డీఈని ఆదేశించారు. శనిగరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ ఎందుకు వండలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవోకు వివరాలు పంపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

ఇసుక కొరత రాకూడదు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 11: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చూసుకోవాలని, అందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌లతో కలెక్టర్ జూమ్ మీటింగ్‌లో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. తహసీల్దార్, ఎంపీడీవోలు కలిసి మండలంలో ఎక్కడ ఇసుక నిల్వలున్నాయో చూసి ఇళ్లకు ఇసుక పంపిణీకి టోకెన్లు జారీ చేయాలన్నారు. మోయతుమ్మెద వాగు, కూడవెల్లి వాగుతో పాటు వాటి ఉప కాలువల్లో ఇసుక నిల్వలు ఉన్న మండలాల్లో ఎలాంటి సమస్య లేదని, మిగతా దగ్గర మండలాల్లో సైతం వాగుల్లో ఇసుక తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలకు సూచించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్‌లకు ఇసుక కావాలని అభ్యర్థన పెట్టుకోవాలని చెప్పారు. జిల్లాలో వనమహోత్సవం లక్ష్యాన్ని సైతం పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని ఆదేశించారు.

విశ్వగురు స్థానంలో భారతదేశం

- వైభవంగా గురుపూజోత్సవం
- వజ్ర పురస్కారాల ప్రదానం

సిద్దిపేట కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సాంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకాలని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. వ్యాస మహర్షి యోగా కేంద్రంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన గురుపూర్ణిమ వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గురువులను గౌరవించడం, గురువుల చూపిన బాటలో నడవడం, భారతీయ మానవత్వ విలువలు ప్రపంచానికి దేశాన్ని విశ్వగురువుగా నిలబెడుతున్నాయన్నారు. జిల్లా విద్యాశాఖ ఎస్‌వో రామస్వామి మాట్లాడుతూ బాల్యం నుంచే సన్మార్గాలను పరిచి భావితరాలను రక్షించే ప్రయత్నాలను ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్ సభ్యులు, ప్రముఖ యోగ గురువు సతీష్, ప్రెస్ అకాడమీ పూర్వ సభ్యులు అంజయ్య, జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, యోగ గురువు తోటసంధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.


వజ్ర పురస్కారాలు అందుకున్న వివిధ రంగాల ప్రముఖులు

విశిష్ట సేవలకు వజ్ర పురస్కారాలు

వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వివిధ ప్రాంతాల ప్రముఖులకు అదనపు కలెక్టర్ వజ్ర పురస్కారాలను ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ, యోగా గురువు రామిరెడ్డి, అభయ జ్యోతి మనోవికాస కేంద్రం సారథి, సంఘ సేవకులు జోజి, పర్యావరణ రక్షకుడు పాలడుగు జ్ఞానేశ్వర్, ఆధ్యాత్మిక రంగంలో కృషి చేస్తున్న అద్దంకి కనకరాజు స్వామి, ప్రముఖ సంగీత కళాకారుడు మారుమాముల శశిధర శర్మ, విద్యారంగంలో విశిష్ట కృషి చేస్తున్న మహిళా టీచర్లు రేణుక, జ్యోతి, సేవా రంగంలో రక్తదాతగా పేరుగాంచిన వరాల ప్రశాంత్ కుమార్, ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఉచితంగా విద్య బోధన చేస్తున్న రిటైర్డ్ టీచర్ బాల్‌రెడ్డికి శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేసి పురస్కారాలను ప్రదానం చేశారు. యోగాలో విశేష కృషి చేస్తున్న యోగా గురువులు, దంపతులు తోట సతీష్ సంధ్యను సత్కరించారు. అంతకుముందు గురు వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాల సమర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో గణేష్ నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజేశం, ప్రసన్నాంజనేయ దేవస్థాన అర్చకులు రమణచార్యులు, యోగా సంఘాల ప్రతినిధులు విక్రమ్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్, రాజ్ కుమార్, గంగాపురం శ్రీనివాస్ లింగమూర్తి, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, సంస్కార భారతి అధ్యక్షురాలు విజయ, యోగా సభ్యులు సాయితేజ, వేణు, భారత స్వాభిమాన్ ట్రస్ట్ సిద్దిపేట సభ్యులు రాములు, నవీన్, వీరేశం, కిషన్, యోగా సొసైటీ సభ్యులు సంపత్, నందిని, విదిష, మంజుల, కవిత, వాసవి, నరేష్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

కుకునూరుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న కేసులో నిందితులను కుకునూరుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 15 గ్రాముల బంగారం, రూ. లక్షా పది వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో తొగుట సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన అన్నా రెడ్డి, మహబూబాబాద్ జిల్లాకు చెందిన కూజా నరసయ్య ఏడాదిగా తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి, రాత్రి వేళ తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు. కుకునూరుపల్లి, కొమురవెల్లి, దుబ్బాక, రాయపోల్, చేర్యాల, బెజ్జంకి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19 చోరీ కేసుల్లో వీరు నిందితులు. చోరీ చేసిన తర్వాత వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం వీరి నైజం. ఈ చోరీలను సవాల్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందం వీరి ఆచూకీని కనుకొని అరెస్ట్ చేసింది. వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకుంది.



ధ్వంసమైన బ్రిడ్జి సైడ్‌వాల్స్

ఆ ఆరు కిలోమీటర్లు.. నరకయాతన!

రాయికోడ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు వెళ్లే ప్రయాణికులకు రాయికోడ్ మండలం షైపత్పూర్ గ్రామం నుంచి మనూరు మండలం, రాయిపల్లి మంజీరా నదిపై ఉన్న బ్రిడ్జి వరకు గల ఆరు కిలోమీటర్ల రహదారి నరకం చూపుతోంది. గత రెండేళ్లుగా ఈ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. రోడ్డుపై వేసిన కంకర పూర్తిగా తేలిపోయి, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. బ్రిడ్జి ప్రారంభానికి ముందే ఒక వైపు కుంగిపోగా, గతంలో లారీ ఢీకొట్టడంతో బ్రిడ్జి సైడ్ రైలింగ్ ధ్వంసమైంది. కనీసం వాటికి ఎలాంటి మరమ్మతులు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పూర్తిగా దెబ్బతిన్న ఈ రోడ్డు కారణంగా ప్రయాణికులు పుల్‌కూర్తి, నారాయణఖేడ్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి, ఈ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

విగ్రహ ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రుద్రారం హనుమాన్ ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రారం హనుమాన్ ఆలయం వద్ద హిందూ సంఘాలు, ఎంపీ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. గురువారం రాత్రి హనుమాన్ ఆలయంలో ఓ వ్యక్తి సీసీ కెమెరాలతో పాటు విగ్రహాలన్నింటినీ ధ్వంసం చేయగా, విషయం తెలిసిన గ్రామస్థులు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎంపీ రఘునందన్‌రావు గ్రామానికి చేరుకొని



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న ఎంపీ రఘునందనరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

పరిస్థితిని సమీక్షించారు. మానసిక దివ్యాంగుడనే పోలీసుల వాదనను ఆయన వ్యతిరేకించారు. తెలంగాణలోని పలు ఆలయాల్లో మానసిక దివ్యాంగుల రూపంలోనే విగ్రహాల ధ్వంసం జరుగుతోందని, వీరంతా కర్ణాటక ప్రాంతానికి చెందిన వారే కావటం గమనార్హమని ఆయన అన్నారు. వారి ముసుగులో సంఘ విద్రోహ కార్యక్రమాలకు పాల్పడుతున్న వారి అసలు రూపాన్ని పోలీసులు బయటపెట్టాలని ఈ సందర్భంగా డీఎస్పీ ప్రభాకర్‌ను కోరారు. హిందూ ఆలయాల్లో విగ్రహాల ధ్వంసం చేస్తున్న అదృశ్య శక్తుల భరతం పడతామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భాజపా అధ్యక్షురాలు గోదావరి, బజరంగదళ్ రాష్ట్ర నాయకులు సుభాష్, వీహెచ్‌పీ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీతో పాటు పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ధ్వంసమైన విగ్రహాల స్థానంలో పునఃప్రతిష్ఠ : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రుద్రారం గ్రామంలో హనుమాన్ ఆలయంలో విగ్రహాల ధ్వంసం దురదృష్టకరమని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రుద్రారం హనుమాన్ గుడి వద్ద ధ్వంసమైన విగ్రహాలను పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. ఇది సున్నితమైన అంశం కాబట్టి నిష్పక్షపాతంగా విచారణ కొనసాగించాలని ఆయన పోలీస్ అధికారులను కోరారు. దీనివల్ల రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో కూడా గొడవలు జరిగే అవకాశం ఉన్నందున పోలీస్ వ్యవస్థ జాగ్రత్తగా ముందుకు సాగాలన్నారు. ధ్వంసమైన విగ్రహాలను జల నిమజ్జనం చేసి, వాటి స్థానంలో కొత్త విగ్రహాలతో పాటు బలిపీఠం, ఒంటె విగ్రహాలను పునఃప్రతిష్ఠిస్తామని, అలాగే సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

పరీక్షల భయంతో ఫినాయిల్ తాగి.. గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

సిద్దిపేట కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షల భయంతో గురుకుల విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శుక్రవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. సిద్దిపేట కేసీఆర్ నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో రిషిక్ పదవ తరగతి చదువుతున్నాడు. రిషిక్ పరీక్షలంటే భయం. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రిషిక్ వసతి గృహంలో కనిపించిన ఫినాయిల్ తాగాడు. గమనించిన తోటి విద్యార్థులు వసతి గృహ బాధ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేయాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయో చెప్పాలంటూ బీఆర్ఎస్వీ నాయకులు వసతిగృహం వద్ద ఆందోళనకు దిగారు. ఆర్డీవో సదానందం వచ్చి, విద్యార్థి సంఘ నాయకులతో మాట్లాడారు. సంఘటనపై పూర్తి విచారణ చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని కలెక్టర్ హైమావతి పరామర్శించారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసీపీ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కూలీ మృతి

చిన్నకోడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిన ఓ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని విఠలాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సైఫ్‌అలీ కథనం ప్రకారం.. విఠలాపూర్‌కు చెందిన మేకల రవి (45) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం గ్రామంలోని ఓ వ్యక్తి వ్యవసాయ బావి వద్ద చెట్లు కోయడానికి గ్రామానికి చెందిన మరికొంత మంది కూలీలతో కలిసి వెళ్లాడు. బావిని అనుకోని ఉన్న చెట్లను రవి మిషన్‌తో కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. దీంతో అతని తలకు, మెడ కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై, ఫైర్ సిబ్బంది వచ్చి తాళ్ల సహాయంతో రవిని బావి నుంచి తీశారు. ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. రవి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శాంతవ్వ, కుమారుడు, కూతురు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

రామచంద్రాపురం టౌన్ జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇనుపచువ్వలు ఏరుకుంటూ వచ్చే డబ్బులతో జీవనం సాగిస్తున్న ఓ మహిళ మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై గోపరాజు కథనం ప్రకారం.. రామచంద్రాపురం కానుకుంట ఎస్‌ఎన్‌రెడ్డి ఫంక్షన్‌హాలు ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న ఈశ్వరమ్మ (50) అనే మహిళ ఇనుపచువ్వలు ఏరుకుంటూ స్క్రాప్ దుకాణంలో అమ్మేది. శుక్రవారం ఉదయం ఎలాంటి చలనం లేకుండా ఉండటంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆమె కుడి చేతిపై శివ, బాలరాజు, రాజశేఖర్ అనే పేర్లతోపాటు శిలువలను పచ్చబొట్టు ఉంది. స్క్రాప్ దుకాణం యజమాని షాబాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు పీర్లు దగ్ధం

సంగారెడ్డి క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కంది మండలం కాశీపూర్‌లో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు పీర్లు దగ్ధమయ్యాయి. ఈనెల 8న గ్రామంలో దూల్‌నాల్ సాబ్ పీర్లను దట్టి, పూలతో అలంకరించి రేకుల షెడ్డులో ప్రతిష్ఠించారు. గురువారం అర్ధరాత్రి వరకు గ్రామస్థులు పీర్ల వద్ద ఊదు వేశారు. అనంతరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఊదు కారణంగా ప్రమాదవశాత్తు అర్ధరాత్రి తర్వాత పీర్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్, సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్‌లు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తామనడంతో భయపడి.. జీపీ కిటికీకి ఉరేసుకున్న యువకుడు

రాయికోడ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ స్టార్ట్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో భయపడిన ఓ యువకుడు పంచాయతీ కార్యాలయ కిటికీకే ఉరి వేసుకున్నాడు. మండల పరిధి హస్నాబాద్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు



గరీబ్ (ఫైల్)

పోలీసుల కథనం ప్రకారం.. వట్‌పల్లి మండలం మర్వెల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం మండల పరిధిలోని హస్నాబాద్‌లోని వారి అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. తల్లీచెల్లెలితో కలిసి ఆ గ్రామానికి వచ్చి ఉంటున్న గరీబ్ (24) గురువారం రాత్రి గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. శుక్రవారం ఉదయం గ్రామస్థులు, ట్రాక్టర్ డ్రైవర్ అశోక్ దేవిదాసులు కలిసి వచ్చి ట్రాక్టర్ ఎందుకు స్టార్ట్ చేశావని గరీబ్‌ను నిలదీశారు. గ్రామపంచాయతీ తాళాలు పగులగొట్టి ట్రాక్టర్ స్టార్ట్ చేసినందుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పి, వెళ్లిపోయారు. భయపడిన గరీబ్ గ్రామపంచాయతీ కార్యాలయ కిటికీకే ఉరి వేసుకున్నాడు. అతని సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టివేత

కోహెడ జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకున్నట్లు కోహెడ ఎస్సై అభిలాష్ తెలిపారు. మండలంలోని వింజపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసమంటూ మూడు బొలెరో వాహనాలు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాయి. చిన్నకోడూరు, బెజ్జంకి మండలాలకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి శుక్రవారం వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చౌటకూర్ మండలంలో మట్టిని తరలిస్తున్న టిప్పర్

పుల్‌కల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలంలోని శివంపేటలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ అనుదీప్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రమోద్‌లకు నమ్మకమైన సమాచారం రావడంతో గ్రామ శివారు ప్రభుత్వ భూముల్లో అక్రమంగా మట్టిని తవ్వి తీసుకువెళ్తున్న టీఎస్35 టీ 1928 నంబరు గల వాహనాన్ని స్వాధీనం చేసుకుని పుల్కల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

దుబ్బాక మండలంలో ట్రాక్టర్..

దుబ్బాక, జూలై 11(ఆంధ్రజ్యోతి): శుక్రవారం రాత్రి దుబ్బాక మండలం ఆకారం గ్రామ శివారులోని కూడవెళ్లి వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం అందింది. దీంతో పోలీసు సిబ్బందితో కలిసి కూడవెళ్లి వాగు వద్దకు వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు దుబ్బాక ఎస్‌ఐ కీర్తిరాజ్ తెలిపారు. ట్రాక్టర్‌ను దుబ్బాక పోలిస్‌స్టేషన్‌కు తరలించిన్నట్టు పేర్కొన్నారు.

ప్రారంభోత్సవం నాటికి పగళ్లు

● చెన్నాపూర్ పంచాయతీ భవనం నాసిరకం పనులపై విమర్శలు

శివ్వంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికగా నిలవాల్సిన నూతన పంచాయతీ భవనం ప్రారంభానికి ముందే గోడలు బీటలు వారాయి. శివ్వంపేట మండలం చెన్నాపూర్ గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగ్గా, భవనంలో పగుళ్లు కనిపించాయి. అధికారులు వెంటనే స్పందించి పగుళ్లకు మరమ్మతులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



భవనం గోడలకు ఏర్పడిన పగళ్లు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే సునీతారెడ్డి

గ్రామాల్లో రాజకీయాలు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, అధికార పార్టీ నాయకులు ఓపికతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కార్యదర్శులకు బిల్లులు రాక, డీజిల్ డబ్బులు లేక చెత్త ట్రాక్టర్లు తిప్పలేక పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సర్పంచుల, కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ కావడంతో ఎరువులకు కొరత లేకుండా ప్రభుత్వం చూడాలన్నారు. రైతులకు రుణమాఫీ 30 శాతం కూడా కాలేదని, రుణమాఫీ అయిన వారితోపాటు కాని వారి జాబితా కూడా సిద్ధం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 60 గజాల నిబంధనలను తొలగించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఐదు లక్షలు ఇచ్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు.

'ఆయిల్‌పామ్'తో అధిక లాభాలు

- మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య
- జిల్లాలో 1200 ఎకరాల్లో సాగు
- ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌సింగ్



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

కొల్చారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడితోనే అధిక లాభాలు పొందవచ్చని మెదక్ జడ్పీ సీఈవో సీహెచ్ ఎల్లయ్య అన్నారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామంలో రైతు జగదీష్ రాజలింగం పొలంలో శుక్రవారం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని వరి రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని, మొక్కలు, డ్రిప్‌నకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. వరి కంటే ఆయిల్‌పామ్‌తో అధిక ఆదాయం వస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని, ఇప్పటివరకు 1200 ఎకరాల్లో సాగుచేశారని తెలిపారు. 2023-24లో 78మంది రైతులు 336 ఎకరాలలో, 2024-25లో 152 మంది రైతులు 533 ఎకరాలలో సాగు చేపట్టారని, ఈ ఏడాది 2500 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. ఇప్పటికే 1545 ఎకరాలకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 771 ఎకరాలు నాటు వేయడానికి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకొని, అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టి లాభాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం.. పందిరి సాగుతో అధిక లాభాలు

- హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ రాజిరెడ్డి



కాకరకాయ పంటను పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్, అదనపు కలెక్టర్

కొండపాక, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల పందిరి సాగుతో రైతులకు అధిక దిగుబడులతోపాటు ఆరోగ్యం లభిస్తుందని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డి.రాజిరెడ్డి తెలిపారు. శుక్రవారం బందారం శివారులో అమ్మన రాజిరెడ్డికి చెందిన 30 ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి సందర్శించి, పందిరి సాగు పంటలను పరిశీలించారు. సేంద్రియ పందిరి సాగుతో పండించిన పంటలకు మార్కెటింగ్ ఎలా ఉంటుందని, సంవత్సరానికి ఎకరాకు ఎంత ఆదాయం వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు. సేంద్రియసాగుకు సన్నకారు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం పెంచితే సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతు అధికారులకు తన అభిప్రాయాన్ని తెలిపారు. పశువుల పేడతో తయారయ్యే ఎరువుల ప్లాంటును కూడా వారు పరిశీలించారు. రైతులు లాభసాటి పంటలపై దృష్టి సారించాలని సూచించిన వైస్ చాన్సలర్, కూలీల కొరత ఉన్నప్పటికీ యాంత్రీకరణతో సాగు చేస్తున్న తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ జిల్లా అధికారి సువర్ణ, మండల అధికారి కౌసల్య, శాస్త్రవేత్తలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పందిరి సాగు పంటలను పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్ రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

నాటు నాటు

బర్డ్‌ఫ్లూతో కుదేలైన పౌల్ట్రీ రంగానికి నాటు కోళ్ల పెంపకం కొత్త దారి చూపుతోంది. బాయిలర్ కోళ్లతో భారీ నష్టాలు చవిచూసిన రైతులు, ఇప్పుడు నాటు కోళ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలానికి చెందిన మన్నె నర్సింగ్‌రావు వంటి రైతులు, ఫారంలో కాకుండా కోళ్లను బయట పెంచుతూ లాభాలు గడిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, సహజమైన పద్ధతుల్లో పెంపకం చేపట్టడం ద్వారా అధిక ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో నాటు కోళ్లకు పెరుగుతున్న డిమాండ్, ఈ కొత్త పెంపకం విధానాన్ని విజయవంతం చేస్తోంది.



- బర్డ్‌ఫ్లూతో దెబ్బతో పౌల్ట్రీఫాంల కుదేలు
- నాటు కోళ్లతో పెంపకంతో సరికొత్త దారి
- ఫారంలో కాకుండా బయట పెంపకం
- తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం
- సోనాలి రకానికి మార్కెట్‌లో డిమాండ్

తూప్రాన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల బర్డ్‌ఫ్లూ, అంతుచిక్కని వ్యాధితో పౌల్ట్రీఫాంలలో పెంచుతున్న కోళ్లు మరణించాయి. దీంతో బాయిలర్ కోళ్లకు డిమాండ్ తగ్గి, పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సంక్షోభం పలువురు రైతులను నాటు కోళ్ల పెంపకంపై దృష్టి సారించేలా చేసింది. మొదట ఐకేపీ మహిళా సంఘాల ద్వారా నెలకు రూ.115 చొప్పున 150 నాటు కోడిపిల్లలను తీసుకుని ఖాళీగా ఉన్న ఫారంలో పెంచడం మొదలుపెట్టారు. కోడిపిల్లలకు ఫారంలో అలవాటు చేసి, ఆ



మధ్యాహ్నం తర్వాత ఫారంలో నాటు కోళ్లు

తర్వాత బయటకు వదలడం ప్రారంభించారు. ఉదయం బయటకు వెళ్లిన కోళ్లు పురుగులు, క్రిములు తిని సాయంత్రానికి తిరిగి ఫారంలోకి వచ్చాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో నాటు కోళ్లను బయట పెంచడం లాభదాయకమని రైతులకు నమ్మకం కలిగింది.

తక్కువ ఖర్చు, అధిక లాభం

నాటు కోళ్ల పెంపకంలో మందులు, దాణా ఖర్చులు చాలా తక్కువ. బాయిలర్ కోడి పిల్లలు దాదాపు రూ.50 వరకు ఉండటంతో పాటు, వాటికి మందులు, భారీగా దాణా అవసరం అవుతుంది. కేవలం 50 రోజుల్లోనే వాటిని విక్రయించాల్సి ఉంటుంది, లేదంటే దాణా ఖర్చులతో నష్టాలు వస్తాయి. నాటు కోళ్ల విషయానికి వస్తే, పిల్లలు తెచ్చిన కొద్దిరోజుల తర్వాత కళ్లలో ఒకసారి మందు వేస్తే సరిపోతుంది. దాణా కూడా తక్కువగా తింటాయి, ఎక్కువ రోజులు ఫారంలో ఉంచినా ఇబ్బందులు ఉండవు.

ఒక్కో నాటుకోడి రూ.500పైనే

మార్కెట్ ధరల విషయానికి వస్తే, బాయిలర్ కోళ్లు కిలో రూ.100కు అమ్ముడుపోతుంటే, నాటు కోళ్లను మూడున్నర నెలలకే కిలో రూ.350 వరకు విక్రయించవచ్చు. ఒక్కో నాటు కోడి రూ.500 నుంచి అంతకంటే ఎక్కువ ధరకు అమ్ముడవుతోంది. నాటు కోళ్లకు మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండటంతో కొనుగోలుదారులు నేరుగా ఫారం వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

సోనాలి రకం పెంపకంపై ఆసక్తి

నాటు కోళ్లలో సోనాలి, కడక్‌నాథ్ రకాలు ప్రధానమైనవి. కాగా, సోనాలి కోళ్లకు ప్రస్తుత మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి పౌల్ట్రీ రైతులు నల్గొండ జిల్లా నుంచి సాధారణ ఒకరోజు కోడిపిల్లలను రూ.32కు, ప్రత్యేకంగా పుంజు (మగ) కోడిపిల్లలను రూ.45 వరకు కొనుగోలు చేస్తున్నారు. సుమారు 20 రోజుల పాటు ఫారంలో పెంచిన తర్వాత, కోళ్లను బయటకు వదలడం మొదలుపెడతారు. ఉదయం 8 గంటలకు బయటకు కోళ్లను విడిచిపెడతారు. అవి గింజలు, పురుగులు తిని మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరిగి ఫారంలోకి వస్తాయి. ఆ తర్వాత వాటికి సాధారణ దాణా వేస్తారు. మూడున్నర నెలల సమయానికి ఒక్కో కోడి కిలోన్నర నుంచి రెండు కిలోల బరువు పెరుగుతుంది. ఈ సమయం నుంచే కోళ్లను విక్రయించడం ప్రారంభించవచ్చు. ఏడాది వరకు అమ్మినప్పటికీ నష్టాలు ఉండవు.



ఫారం నుంచి వదలడంతో బయట తింటున్న నాటు కోళ్లు

నాటు కోళ్ల పెంపకం బాగుంది



పౌల్ట్రీ ఫారంలో నాటు కోళ్ల పెంపకం చాలా బాగుంది. వాటిని సాధారణ కోళ్లలాగే బయటకు వదిలి పెంచుతున్నాం. ఈ పద్ధతి వల్ల కోళ్లకు మంచి డిమాండ్ ఉంది. బాయిలర్ కోళ్లతో పోలిస్తే మందులు, దాణా ఖర్చులు తక్కువగా ఉన్నాయి. ధర కూడా ఎక్కువగా ఉండటంతో పాటు, డిమాండ్ కూడా బాగానే ఉండటం వల్ల ఇది చాలా లాభదాయకంగా ఉంది.

- మన్నె నర్సింగ్‌రావు, నాటుకోళ్ల పెంపకందారు, ఇమాంపూర్

వానాకాలం.. వ్యాధుల గాలం

- వాతావరణ మార్పులతో దోమల విజృంభణ
- పారిశుధ్య లోపంతో జ్వరాలు
- డెంగీ, మలేరియా ముప్పు.. అప్రమత్తతే రక్ష!
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం



కొండపాక, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు సీజనల్ వ్యాధుల విజృంభణకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వర్షాలు పడి తగ్గిన తర్వాత, నిలిచి ఉన్న నీటితో దోమల వ్యాప్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం దోమల వృద్ధికి ప్రధాన కారణంగా మారుతోంది. మురుగునీరు నిలిచిపోవడం, పారిశుధ్య లోపం డెంగీ జ్వరాలకు దారితీస్తోంది. ఇప్పటికే కొండపాకకు చెందిన పలువురు సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

జాగ్రత్తలతోనే..

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు. వర్షాలతో కొత్త నీరు చేరడం, నీటి నిల్వలు పెరగడం వల్ల వివిధ రకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా, తాగే నీటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత పాటిస్తే రోగాల బారిన పడకుండా ఉండవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. వర్షాలకు రోడ్లపై ఏర్పడే గుంతలు, వాటిలో నిలిచే నీరు దోమలకు ఆవాసంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు

- ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అతిసార వ్యాధి, ఇతర కడుపు సంబంధిత సమస్యలను నివారించవచ్చు.
- కలుషిత ఆహారం, నీటికి దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. దీనివల్ల డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.
- డెంగీ, మలేరియా జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమతెరలు తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇళ్ల చుట్టూ మురుగు గుంతలు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఇంట్లో ప్రతి వారం ఒక రోజును 'డ్రై డే'గా పాటించి, నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. కూలర్లు, పూల కుండీలు, టైర్లలో ఇతర చోట్ల నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- మనం నివసించే ప్రాంతాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టుపక్కలా ఎక్కడా మురుగు నీరు నిలిచిపోకుండా జాగ్రత్తపడాలి.
- వీలైనంత వరకు తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగి వాడాలి.

ప్రస్తుతం కేసులు నమోదు కాలేదు



వర్షాకాలంలో దోమలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం మా పీహెచ్‌సీ పరిధిలో డెంగీ, మలేరియా లాంటి తీవ్రమైన కేసులు ఎలాంటివి నమోదు కాలేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి జ్వరం, డయేరియా వంటి లక్షణాలు కనిపించినా వెంటనే ప్రాథమిక చికిత్స కోసం రావాలి. అందుకు పీహెచ్‌సీతో పాటు అన్ని సబ్‌సెంటర్లలో మందులు సిద్ధంగా ఉన్నాయి.

- డాక్టర్ శ్రీధర్, కొండపాక పీహెచ్‌సీ వైద్యాధికారి





కోహీర్ కొత్త బస్టాండ్ ప్రాంతంలో రోడ్డుపై చేరిన మురుగు నీరు, పని చేయని హైమాస్ట్ లైట్లు

కోరి మున్సిపాలిటీగా మార్పు అభివృద్ధికి ఏదీ మలుపు?

- సమస్యల సుడిగుండంలో కోహీర్ బల్దియా
- అందుబాటులో లేని అధికారులు
- పనుల కోసం ప్రజలకు తప్పని పడిగాపులు
- అధ్వానంగా మురుగు కాలువలు, రోడ్లపై చెత్త, బురదమయం

కోహీర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చుకుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాదన్న ఆశతో మండల కేంద్రమైన కోహీర్ ప్రజలు గతంలో ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా గ్రామపంచాయతీగా కొనసాగిన సమయంలో గ్రామస్థులు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు మండల కేంద్రమైన కోహీర్‌ను ప్రభుత్వం గత జనవరి మాసంలో కొత్త మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. కానీ అభివృద్ధికి మాత్రం ఇది మలుపు కాలేకపోయింది. ఇక్కడ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఇతర సిబ్బందిని నియమించినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. పేరుకే మున్సిపాలిటీగా మారి ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లుగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోహీర్ మున్సిపాలిటీ కార్యాలయం

కార్యాలయానికి రాని అధికారులు..

మున్సిపల్ కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండకపోవడం ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు నిరాశతో వెనుతిరుగుతున్నారు. అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు ప్రభుత్వంపై, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మా సమస్యలు పరిష్కరించమని ఫోన్ చేస్తే, ఏకంగా ఫోన్ నంబర్లనే బ్లాక్ చేస్తున్నారు' అని కోహీర్‌కు చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలి. కార్యాలయానికి వస్తే ఏ ఒక్క అధికారి అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు నిరాశతో వెళ్తున్నారు. ఫోన్ చేస్తే స్పందించకపోవడం సరైన పద్ధతి కాదు. వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను మున్సిపల్ శాఖ అధికారులు తక్షణమే పరిష్కరించాలి. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తాం.

- సంపత్‌కుమార్, కోహీర్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



కోహీర్‌లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా, ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించకపోవడం ఒకవంతైతే, అసలు అధికారులు సక్రమంగా కార్యాలయానికి రావడం లేదు. పట్టణంలో సరైన మురుగు కాలువలు లేక, రోడ్లు అధ్వానంగా మారగా, తాగునీరు రాక, వీధి లైట్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు నలుగురు మున్సిపల్ కమిషనర్లు మారారు తప్ప, సమస్యలు మాత్రం ఒక్కటి కూడా పరిష్కరించబడలేదు.

- వాజీద్ జాబీ, కోహీర్

కొత్త మున్సిపాలిటీలో సమస్యల తిష్ట

కోహీర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఏ వీధి చూసినా మురుగు కంపు, మురుగునీటి గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ బురదమయంగా మారాయి. కాలనీల అభివృద్ధిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టణంలోని చాలా చోట్ల వీధిలైట్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రివేళల్లో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే, తాగునీరు కూడా సక్రమంగా అందడం లేదని వివిధ కాలనీల ప్రజలు వాపోతున్నారు.

గజ్వేల్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సతో తల్లికి ప్రాణ రక్షణ

గజ్వేల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కఠినమైన శస్త్రచికిత్స ద్వారా ఒక తల్లి ప్రాణాన్ని రక్షించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘాట్‌కు చెందిన ఎర్రన్నగారి ప్రవీణకు 13 సంవత్సరాలుగా పిల్లలు లేరు. ఇటీవల ఆమె ఇన్ఫెర్టిలిటీ ద్వారా గర్భం దాల్చగా, విపరీతమైన కడుపునొప్పి రావడంతో ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించారు. గర్భాశయంలో కాకుండా ఫెలోపియన్ ట్యూబ్‌లో పిండం ఉన్నట్లు నిర్ధారించగా, ఇది చాలా కఠినమైన గర్భమని, రక్తహీనత (7 గ్రాములు మాత్రమే రక్తం) కారణంగా హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఈ విషయమై జిల్లా ఆసుపత్రిని సంప్రదించగా, వైద్యులు స్కానింగ్ చేసి కష్టతరమైనదిగా భావించి డాక్టర్ అన్నపూర్ణ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే శస్త్రచికిత్స చేసి, ఫెలోపియన్ ట్యూబుల నుంచి 500 గ్రాముల రక్తపు గడ్డలను విజయవంతంగా తొలగించారు. తల్లి ప్రాణానికి ఎటువంటి ముప్పు లేకుండా ఆపరేషన్ విజయవంతం చేశామని డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. మరొక ఫెలోపియన్ ట్యూబ్ కూడా బలహీనంగా ఉన్నందున, భవిష్యత్తులో గర్భం వస్తే తల్లికి ప్రమాదమని భావించి, టుబెక్టమి ఆపరేషన్ కూడా చేసినట్లు వివరించారు. ప్రస్తుతం తల్లి ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఈ సర్జరీలో డాక్టర్లు అన్నపూర్ణ, ప్రణయరెడ్డి, అనస్తీషియా సూర్య, థియేటర్ అసిస్టెంట్ శ్రీలత పాల్గొన్నారు.

కేజీబీవీ పనులకు మోక్షమెన్నడో?

- రాయపోల్‌లో సొంత భవనానికి రూ.3.50 కోట్లు మంజూరు
- నాలుగేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే
- నేటికీ పనులు పూర్తికాక అద్దె భవనం వరండాలో చదువులు
- అరకొర వసతుల మధ్య విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



నత్తనడకన సాగుతున్న రాయపోల్ కేజీబీవీ పనులు, వరండాలో ఇంటర్ విద్యార్థులు(ఫైల్)

రాయపోల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలంలో కేజీబీవీ నిర్మాణ పనులునత్తనడకన సాగుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు నాలుగేళ్లుగా ఓ విద్యాలయానికి సంబంధించిన భవన నిర్మాణం పనులను సాగదీస్తుండటంలో అంతర్యమేమిటని మండలప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తొమ్మిదేళ్ల క్రితం అద్దె భవనంలో..

తొమ్మిదేళ్ల క్రితం రాయపోల్‌లో కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ పాఠశాలను ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 200ల మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. అప్పట్లో రాయపోల్‌లో కేజీబీవీ భవన నిర్మాణం కోసం సర్వ శిక్షా అభియాన్ పథకంలో భాగంగా రూ. 3.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో నాలుగేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు కొత్తపల్లి శివారులో స్థలాన్ని సేకరించి అప్పగించారు. 2022 ఏప్రిల్ 28న నాటి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి అప్పటి మంత్రి హరీశ్‌రావు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులకు శంకుస్థాపన చేసి నాలుగేళ్లు గడిచినా నిర్మాణ పనులు మాత్రం నత్తనడకన సాగడం గమనార్హం.

కొత్తగా ఇంటర్ తరగతులు మంజూరు

ఇప్పటికే అరకొర వసతులతో నడుస్తున్న కేజీబీవీకి ఇంటర్ ఒకేషనల్ కోర్సులు మంజూరయ్యాయి. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్టీ విభాగాల్లో 40 మంది చొప్పున విద్యార్థులను చేర్చుకొని ఈ ఏడాది నుంచే తరగతులు నిర్వహించాల్సి ఉంది. అయితే అరకొర వసతుల కారణంగా ఈ సంవత్సరం ఒక్కో విభాగంలో 20 మంది చొప్పున విద్యార్థులను చేర్చుకొని సమస్యల మధ్యన తరగతులను కొనసాగిస్తున్నారు.

గదుల కొరతతో ఇక్కట్లు

ఇప్పటికే అద్దె భవనంలో కొనసాగుతున్న కేజీబీవీ భవనంలో ఉన్న గదుల్లో అతి కష్టం మీద తరగతులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల మంజూరైన ఇంటర్ కోర్సుల నిర్వహణ అధ్యాపకులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో చేసేదేమీ లేక ఇంటర్ ఒకేషనల్ తరగతులను కేజీబీవీ వరండాలోనే నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా నూతన భవనాన్ని నిర్మించి పాఠశాలకు అందజేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. కాగా నూతన భవనం నిర్మాణ పనుల జాప్యంపై సంబంధిత అధికారులను 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా సంప్రదించగా ఎవరూ అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

జనాభా నియంత్రణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ

జిల్లాలో ప్రపంచ జనాభా దినోత్సవం



నారాయణరావుపేట మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సిద్దిపేట రూరల్/దుబ్బాక, జూలై 11(ఆంధ్రజ్యోతి): సమాజంలో జనాభా నియంత్రణ లేకుంటే కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ఇది ప్రతీ ఒక్కరి బాధ్యత అని పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ పాండురంగాచారి పేర్కొన్నారు. శుక్రవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ, ఆడ అనే తారతమ్యం లేకుండా తల్లిదండ్రులు పిల్లలను పెంచాలని సూచించారు. దంపతులందరూ కుటుంబనియంత్రణ తాత్కాలిక పద్ధతులను పాటించడం వల్ల జనాభా నియంత్రణ సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బీఎస్ చారి, హెల్త్ సూపర్వైజర్ సునీత, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. జనాభా విస్ఫోటనం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కుటుంబనియంత్రణ పాటించడం ఎంతైనా అవసరమంటూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులున్నారు.

పోటీల్లో విజేతలకు బహుమతులు

సిద్దిపేట కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ పాపులేషన్ ఎడ్యుకేషన్ సెల్, ఎస్ఈఆర్టీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కామిక్ పిక్చర్స్ రైటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. మండలస్థాయి విజేతలకు జిల్లాస్థాయిలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ మండలాల నుంచి 48 మంది విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పదోతరగతి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కాగా కొమురవెల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని శైలజ, కుకునూర్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి భరద్వాజ్, పోతారెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని శ్రీనిధి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులను అందుకున్నారు. క్వాలిటీ కోఆర్డినేటర్ భాస్కర్ నేతృత్వంలో జరిగిన ఈ పోటీలకు సిద్దిపేట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఇందిరానగర్ ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్‌రెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



జిల్లాస్థాయి విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం

ప్రతీ విద్యార్థికి చట్టాలపై అవగాహన తప్పనిసరి



నంగునూరు హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజగోపాలపేట ఎస్ఐ వివేక్



మర్కుక్: పాములపర్తి పాఠశాల విద్యార్థులతో ఏఎస్ఐ అమృత్, ఉపాధ్యాయులు

నంగునూరు/మర్కుక్/బెజ్జంకి/హుస్నాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలని, అదేవిధంగా ప్రతీ ఒక్కరికి నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని పోలీసులు సూచించారు. శుక్రవారం పలు మండలాల్లోని పాఠశాలల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలు, మహిళలు, చిన్నపిల్లల రక్షణ కోసం రూపొందించిన ప్రత్యేక చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నంగునూరు హైస్కూల్లో రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వివేక్ మాట్లాడుతూ.. చదువుకునే వయసులో చెడు అలవాట్లకు బానిస కావద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట షీటీమ్ బృందం, హెచ్ఎం రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మర్కుక్ మండలం పాములపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏఎస్ఐ అమృత్ మాట్లాడారు. సమాజంలో మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, మహిళా చట్టాలను అందరూ గౌరవించాలని ఏఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు లతీఫ్ సైదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని రేగులపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఐ సౌజన్య విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే కల్లెపల్లిలో కమ్యూనిటీ పోలీసు మీటింగ్ ద్వారా ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ మోసాల పై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. కాగా సిటీ పోలీసు యాక్టు అమలులో ఉన్నందున బెజ్జంకి మండలంలో బైక్, ఇతర ర్యాలీలకు అనుమతులు లేవని ఎస్ఐ సౌజన్య తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో ఎస్ఐ లక్ష్మారెడ్డి మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్, సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ తదితరులున్నారు.

మొక్కలతోనే మానవుల మనుగడ



చిన్నకోడూరు: చౌడారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఫారెస్ట్ అధికారులు

చిన్నకోడూరు/ములుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): చెట్లను పెంచడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా చిన్నకోడూరు మండలం చౌడారం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శ్రీకాంత్, సుమన, పంచాయతీ కార్యదర్శి అనిత, పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ములుగు మండలం చిన్నతిమ్మాపూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మీరా కుమారి, ఎంపీవో వినోద్, ఎఫ్ఎస్‌వో షేఖావత్‌హుస్సేన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలను పరిష్కరించాలి: ఐద్వా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఐద్వా బృందం

చేర్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద అన్నారు. చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఐద్వా బృందం సందర్శించి రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో కనీస వసతులు లేకపోగా, నామమాత్రపు వైద్యసేవలతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారన్నారు. ఆస్పత్రిని ఉన్నతీకరించేందుకు అధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయి వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలని, లేదా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొంగరి వెంకటలక్ష్మి, గొగురు చంద్రకళ, మంద శోభ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరిప్రతాప్‌రెడ్డి శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నర్సాయపల్లికి చెందిన సింగబోయిన పోచయ్యకు రూ.25వేలు, కొండాపూర్‌కు చెందిన చిలుక భాగ్యలక్ష్మికి రూ.35వేలు, లద్నూరుకు చెందిన కుర్రెల గాలమ్మకు రూ.37వేల విలువైన చెక్కులను అందజేశారు.

ప్రత్యేక నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



సదస్సులో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వక్త

సిద్దిపేట కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్, కృషికల్ప ఆధ్వర్యంలో శుక్రవారం డిగ్రీ విద్యార్థులకు వ్యవస్థాపకత (అంత్రపెన్యూర్‌షిప్) అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కృషికల్ప సంస్థ నుంచి గ్రామీణ వ్యవస్థాపక అభివృద్ధి కార్యక్రమం అధిపతి ఆర్. ఈరన్న హాజరై విద్యార్థులకు బలాలు, బలహీనతలు, అవకాశాలు, భయాలు అనే అంశాలపై మాట్లాడారు. బలహీనతలను అధిగమించి బలంగా ఎలా మార్చుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి.సునీత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి అయోధ్య రెడ్డి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా సీహెచ్. మధుసూదన్ అంత్రపెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ సెల్ సమన్వయ కర్త గురుచరణ్‌దాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరణ

ఆగస్టు 6, 7న రెండు రోజుల పాటు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగే వర్క్‌షాపు బ్రోచర్‌ను శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రూసా వారి ఆర్థిక సౌజన్యంతో ఎక్స్‌ప్లోరింగ్ ద బోటానికల్ వరల్డ్, ఏ హ్యాండ్స్ ఆన్ అడ్వంచర్ అనే అంశంపై ఈ వర్క్‌షాప్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీత తెలిపారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి రాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శైలజ కోకన్వీనర్స్ ఆర్ స్రవంతి, డాక్టర్ మిరాజ్ ఫాతిమా, ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మురికి కాలువలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కమిషనర్ మల్లిఖార్జున్

హుస్నాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ సూచించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 20వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వార్డులోని మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇళ్ల పరిసరాల్లో నిలువ ఉన్న నీటిని పారబోయించారు. రోడ్లపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగామన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ బాల ఎల్లం, ప్రసాద్, రవికుమార్, భవాని, సాంబరాజు తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సిద్దిపేట అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రత పై ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి కేజీబీవీ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ హెల్త్ ఎక్స్టెన్షియల్ ఆఫీసర్ చంద్రశేఖర్, కొండయ్య మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి వద్ద కూడా పరిసరాల పరిశుభ్రత పాటించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ ఆర్షియా, హెల్త్ డిపార్ట్‌మెంట్ సుధీర్, నాగేందర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు



ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి మల్లయ్య

తొగుట. జూలై 11(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి మల్లయ్య ఉపాధ్యాయులను హెచ్చరించారు. శుక్రవారం తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. గ్రామానికి 33 ఇళ్లు మంజూరు కాగా 23ఇళ్లకే మార్కింగ్ ఇవ్వడం పట్ల పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగతా 10 ఇళ్లను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో నర్సయ్య, పంచాయితీ కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయుడు భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సభ్యత్వ నమోదు

మర్కుక్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల సాధనలో పీఆర్టీయూ అన్ని సంఘాల కన్నా ముందు వరుసలో ఉంటుందని పీఆర్టీయూ మర్కుక్ మండల అధ్యక్ష కార్యదర్శులు రేబల్లి శ్రీనివాసరావు, తుమ్మ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని చేబర్తి, అంగడికిష్టాపూర్, ఎర్రవల్లి, పాములపర్తి పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఆర్టీయూ కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి అదరాసుపల్లి శశిధరశర్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లాలో సభ్యత్వ నమోదులో మర్కుక్ మండలం ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో మండల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు లతీ, సైదా, అసోసియేట్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, యాదిరెడ్డి, షాబుద్దీన్, శ్రీధర్, గణేష్, మహిళా అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షురాలు రజిత పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

చేర్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం చేర్యాల ప్రభుత్వ బాలుర జడ్పీఎస్ఎస్‌లో సభ్యత్వనమోదు చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ చిత్తశుద్ధితో పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రేకులపల్లి లింగారెడ్డి, కర్రోల్ల స్వర్ణ కుమార్, జంగిటి శ్రీనివాస్, రచ్చ కనకయ్య, సలేంద్ర యాదగిరి ఉన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

మర్కుక్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర యూటీఎఫ్ కమిటీ సభ్యులు వెంకటకిరణ్ అన్నారు. మర్కుక్ మండలంలోని కర్కపట్ల దామరకుంట, పాములపర్తి, చేబర్తి, ఇప్పలగూడెం పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కేజీబీవీ మర్కుక్‌లో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు గజ్వేల్ వెంకట్‌కిరణ్ మాట్లాడుతూ టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కేజీబీవీ, యూఆర్ఎస్ సిబ్బందిని ఐక్యంచేసి నిర్వహించిన పోరాటాల ఫలితంగా 12 నెలల వేతనాల పెంపు సాధించుకున్నామన్నారు. కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నష్టాల రూట్ మార్చి... లాభాల దారిలో ప్రయాణం

(3వ పేజీ తరువాయి..)

యాదగిరిగుట్ట, గోదావరిఖనితో పాటు ప్రతి గంటకు హైదరాబాద్‌కు బస్సులు నడిపిస్తున్నారు. మరికొన్ని రూట్లో బస్సులు నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హుస్నాబాద్ మీదుగా అదనంగా ఇతర డిపో బస్సులు నడుస్తున్నాయి. హన్మకొండ డిపోకు చెందిన బస్సులు సిద్దిపేట, సికింద్రాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు సిద్దిపేటకు ఒక ఎలక్ట్రికల్ బస్సు నడుస్తుంది.

మంత్రి పొన్నం చొరవతో డిపోకు లాభాలు..



ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో ఈ డిపో అభివృద్ధి బాట పట్టింది. డిపోకు కొత్త బస్సులు కేటాయిస్తున్నారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తున్నారు. ప్రజలు అడిగితే ఆ గ్రామాలకు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అలాగే ఈ డిపోకు మరిన్ని బస్సులు తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

\- వెంకన్న, డిపో మేనేజర్

న్యూస్ బాక్స్

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్, బెజ్జంకి, వడ్లూరు, రేగులపల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబ సభ్యులను శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పులికృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నానో యూరియా వాడాలి

మిరుదొడ్డి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ నానో యూరియాను వాడడం వలన అధిక లాభాలుంటాయని ఏవో మల్లేశం పేర్కొన్నారు. శుక్రవారం మిరుదొడ్డిలో ఫర్టిలైజర్ దుకాణంలో నానో యూరియాను ఏఈవోతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంప్రదాయ ఎరువులను వాడడం కన్నా నానో యూరియాను వాడడం వలన అనేక లాభాలుంటాయని తెలిపారు. నానోయూరియాను ఆకులపై పిచికారి చేయడంద్వారా మొక్కలు పోషకాలను సమర్థవంతంగా గ్రహించి పంట దిగుబడి 8శాతం పెరుగుతుందని తెలిపారు.

గూడు లేని నిరుపేదలకు ఇళ్లు

ములుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గూడు లేని నిరుపేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూతాడి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ములుగులో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కడపల నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో మాక్‌పోలింగ్

మిరుదొడ్డి,జూలై11(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఓటుహక్కు ప్రాధాన్యతను తెలుసుకోవాలని మిరుదొడ్డి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అర్చనప్రియదర్శిని అన్నారు. శుక్రవారం మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు మాక్‌పోలింగ్‌ను నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సీఎం, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూలై 11: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి హయాంలో రైతుల సంక్షేమానికి కృషి చేశామో చర్చించేందుకు, దమ్ముంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నారు. ప్రతీ పేదవాడికి ప్రభుత్వ పథకాలు చేరేవిధంగా సీఎం, మంత్రులు కృషిచేస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, నర్సింలు, స్వామి, నాగరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

జగదేవ్‌పూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని భగవంతుడి సేవకు మించిన సంపద ప్రపంచంలో మరొకటి లేదని శ్రీ రామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్‌లో మార్కండేయ భజనమండలి ఆధ్వర్యంలో 100వారాల పాటు 20మంది భక్తులు క్రమం తప్పకుండా భజన చేయడంతో వారికి సీతా రాముల ఫొటోలు అందజేసి సత్కరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

ములుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ములుగు మండలంలోని అత్యధిక స్థానాల్లో బీజేపీని గెలిపించుకోవాలని ఎంపీ రఘునందన్‌రావు కోరారు. శుక్రవారం ములుగు మండలం వంటిమామిడి, లక్ష్మక్కపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు హైదరాబాద్‌లోని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు.

కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షను జయప్రదం చేయాలి

చేర్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఈనెల 14వతేదీన సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న నిరాహారదీక్షను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ అన్నారు. శుక్రవారం చేర్యాల పట్టణంలో జరిగిన కేజీకేఎస్ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుసరిస్తున్న గీత కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. దీక్షకు చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల నుంచి అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు అనగోని నర్సింహులు, తాళ్లపల్లి రాజు, కోల సత్తయ్య, బొంగోని భాస్కర్, బూడిద చందు తదితరులు పాల్గొన్నారు.